క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ ఊరేగింపు



ముత్యాలమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలో ప్రసిద్ధి గాంచిన గొంగటిపల్లి ముత్యాలమ్మ ఊరేగింపును ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏడాది ఉగాది పండుగను పురస్కరించుకుని గ్రామ పెద్దల సమక్షంలో అమ్మవారిని ఊరేగింపు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే ఈసారి కూడా ఊరేగింపును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి టెంకాయ, పూలు, పసుపు కుంకుమలను అమ్మవారికి ఇచ్చి భక్తిని చాటుకున్నారు. ముందుగా లేపాక్షిలోని ఊరి వాకిలి వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోకి అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు.

ఆలయానికి వెండి వితరణ

హిందూపురం: పట్టణంలోని వాసవీ కన్యాకపరమేశ్వరీ ఆలయంలోని మూలవిరాట్ వాసవీ మాత బంగారు విగ్రహం వెనుక వెండి ప్రభావళి, పీఠం నిర్మాణానికి 3.5 కేజీల వెండిని దాతలు అందజేశారు. తాతామల్లికా రామనాథగుప్తా, లక్ష్మీ, వినయ్ కుటుంబ సభ్యులు ఆర్యవైశ్య సంఘం చైర్మన్ జేపీకే రాముకు ఆదివారం వెండి అందించారు. కార్యక్రమంలో కోశాధికారి రవీంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

‘పురం’లో హ్యాపీ మొబైల్స్ షాపు ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సినీనటులు ఐశ్వర్య రాజేష్, రేవంత్

హిందూపురం టౌన్: పట్టణంలో నూతనంగా హ్యాపీ మొబైల్స్ షోరూమ్‌ను హీరోయిన్ ఐశ్వర్యరాజేష్, బాల నటుడు రేవంత్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో హ్యాపీ మొబైల్స్ ఎండీ కృష్ణపవన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ , సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

పెనుకొండ రూరల్: టిప్పు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని 4వ వార్డు కౌన్సిలర్ తయ్యూబ్ ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్ కాలనీ, అర్బన్ కాలనీ, కమాన్ వీధి, కొత్తపేటలోని పలు ముస్లిం కుటుంబాలకు సరుకులను అందజేశారు.

వ్యక్తికి గాయాలు

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాంలో గుర్తు తెలియని వ్యక్తి గాయపడిన సంఘటన అమ్మవారిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. కియా ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. పెనుకొండ 44వ జాతీయ రహదారిపై అమ్మవారిపల్లి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటే క్రమంలో అనంతపురం వైపు నుంచి బెంగళూరు వెళ్తున్న లారీ ఢీ కొనింది. ఈ ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకొన్న ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకొని 108 వాహనం ద్వారా హుటా హుటిన క్షతగాత్రుడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

అమరాపురం: స్థానిక శిర రోడ్డులోని ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రహదారిలోని వంక వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఆదివారం రాత్రి ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు .. ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న పునిత్, పాత ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న అనిల్ ఎదురెదురుగా ద్విచక్ర వాహనాల్లో ఢీ కొన్నారు. ఇద్దరూ గాయపడగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనిల్‌కు తీవ్రగాయాలు కాగా హిందూపురం ఆస్పత్రికి తరలించారు.



పెనుకొండలో నిర్మించిన ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం



మూసి ఉన్న క్రీడాకారుల పెవిలియన్ భవనం



నిరుపయోగంగా మారిన షాపింగ్ కాంప్లెక్స్

ప్రభుత్వ నిర్లక్ష్యం..
క్రీడాకారులకు శాపం !



టెన్నిస్ కోర్ట్ ఇలా..

- అర్ధంతరంగా ఆగిన పెనుకొండ ఇండోర్ స్టేడియం పనులు
- తుప్పుపడుతున్న క్రీడాపరికరాలు
- నిరుపయోగంగా మారిన టెన్నిస్‌కోర్టు
- అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్‌గా మారిన వైనం

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్మించిన ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం (ఇండోర్ స్టేడియం) దిష్టిబొమ్మలా మారింది. పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో పదేళ్లుగా దీన్ని పట్టించుకునేనాథుడే కరువయ్యారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం, నిధుల లేమి, నిర్వహణాలోపంతో అసలు పెనుకొండలో ఇండోర్ స్టేడియం ఒకటి ఉందా ? అన్న ప్రశ్న తలెత్తుతోంది.

పదేళ్లు గడచినా పురిటి నొప్పులే..

2014–15లో పెనుకొండకు ఇండోర్ స్టేడియం మంజూరైంది. అప్పటి టీడీపీ ప్రభుత్వం దీనికి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంగా నామకరణం చేసి శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఫెడరేషన్) నేతృత్వంలో రూ. 2.10 కోట్లు మంజూరు చేసింది. ప్రారంభంలో పనులు వేగవంతంగా జరిగాయి. ఇందులో షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, వాకింగ్ ట్రాక్, జిమ్ తదితర క్రీడలకు అనువుగా ప్లానింగ్ చేసి పనులు చేపట్టారు. ఆరంభంలో కొంతమేర నిధులు మంజూరైనా అనంతరం నిధుల విడుదలలో జాప్యం జరగడంతో పనులు నిలిచిపోయాయి. అయితే నిధులు మంజూరు అవుతాయన్న ఆలోచనతో కాంట్రాక్టర్ ఏకంగా రూ. 92 లక్షలు చేతి నుంచి ఖర్చు చేసినా పనులు మాత్రం అరకొరగా ఆగిపోయాయి. 10 నెలల క్రితం పెనుకొండ సబ్‌కలెక్టర్‌గా పని చేసిన అపూర్వభరత్ రూ.4 లక్షలు తన సొంత నిధుల నుంచి విడుదల చేసి కొంత మేర పనులు పూర్తి చేయించి క్రీడలకు అనుకూలంగా మార్చారు. ఆయన బదలీ అనంతరం దీని గురించి పట్టించుకునే కరువయ్యారు.

తుప్పు పడుతున్న పరికరాలు..

ఇండోర్ స్టేడియంలో అనేక పరికరాలు తుప్పు పడుతున్నాయి. ఇప్పటికే జిమ్‌కు వినియోగించే పరికరాలు, టెన్నిస్ కోసం ఏర్పాటు చేయించిన ఇనుప స్తంభాలు సైతం తుప్పుపట్టాయి. ఇంజనీర్ అవగాహనా లోపంతో ఈ పనులను అర్ధాంతరంగా ఆపి వేశారు. ఇక .. టేబుల్ టెన్నిస్ సైతం నిరుపయోగంగా మారింది. పలుచోట్ల వాకింగ్ ట్రాక్ కూడా దెబ్బతింది.

మందు.. విందు..

క్రీడా వికాస కేంద్రం బయట రోడ్డు పక్కనే దుకాణాలు కట్టించినా అవి కూడా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయాయి. ఏకంగా షట్టర్లను విరిచి వేసి మందు, విందు, ఇతర కార్యక్రమాలకు వినియోగించుకుంటున్నారు. నీటి పైపులు బయట కాలిపోయి కనిపిస్తున్నాయి. క్రీడాకారుల కోసం ఏర్పాటు చేయించిన మరుగుదొడ్లు, పెవిలియన్ కేంద్రం నిరుపయోగంగా మారాయి. కనీసం నైట్ వాచ్‌మెన్ కూడా లేకపోవడం ఇండోర్ స్టేడియం అధ్వానంగా మారింది. ప్రధానంగా దీనికి కాంపౌండ్ కూడా లేకపోవడంతో నలు దిక్కుల నుంచి ఆకతాయిలు ఇక్కడికి వస్తూ అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్‌గా మారుస్తున్నారు. ఇండోర్ స్టేడియాన్ని ఆనుకునే డిగ్రీ కళాశాల ఉన్నా విద్యార్థులు సైతం ఇండోర్ స్టేడియం ముఖం కూడా చూడడం లేదంటే అధికారుల్లో దీనిపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. కళాశాల అధ్యాపకులైతే స్టేడియం గురించి మాట్లాడడానికే విముఖత చూపిస్తున్నారు. కనీసం ఇప్పటికైనా ఇండోర్ స్టేడియాన్ని అభివృద్ధి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

పరికరాలు తుప్పు పడుతున్నాయి



ఇండోర్ స్టేడియంలో జిమ్, టెన్నిస్ పరికరాలు తుప్పుపడుతున్నాయి. అధికారులు ఎవరూ పర్యవేక్షించడం లేదు. నిధుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ కొంత సహకారం అందించినా అనంతరం సహకారం లేదు. ఇండోర్ స్టేడియం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా ఉండటంతో షట్టర్లు విరిచివేశారు. అధికారులు మైదానాన్ని అందుబాటులోకి తెచ్చి క్రీడాభివృద్ధికి చర్యలు చేపట్టాలి.

– అమర్‌నాథ్‌రెడ్డి, షటిల్ క్రీడాకారుడు, పెనుకొండ

క్రీడలను ప్రోత్సహించాలి



ఇండోర్ స్టేడియాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చి క్రీడాల అభివృద్ధికి ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలి. అధికారులు తూతూ మంత్రంగా నిర్మించి చేతులు దులుపుకుంటే సరిపోదు. పెనుకొండలో ఎంతో మంది క్రీడాకారులు ఉన్నారు. అయితే వారికి ఏ మాత్రం ఈ మైదానం ఉపయోగపడటకపోవడం బాధాకరం. దీనికి తగిన నిధులు విడుదల చేసి క్రమం తప్పకుండా క్రీడలు జరిగేలా చూడాలి. పక్కాగా పర్యవేక్షణ చేపట్టి, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలి. నైట్ వాచ్‌మెన్‌ను నియమించి కాంపౌండ్ నిర్మించాలి.

– కాడిశెట్టి శ్రీనివాసులు, ఏపీ ఎస్టీప రాష్ట్ర అధ్యక్షుడు

రూ. 92 లక్షల బిల్లు రావాలి

2014-15లో ఇండోర్ స్టేడియం మంజూరు కాగా పనులు వెంటనే చేపట్టాను. ఇప్పటికీ రూ. 92 లక్షల బిల్లు రావాల్సి ఉంది. శాఫ్ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. వడ్డీలు కట్టుకోడానికి ఇబ్బంది పడుతున్నా. అనేక సార్లు అధికారుల దృష్టికి సమస్య తీసుకువెళ్లినా పట్టించుకునే వారు లేరు. పర్యవేక్షణా లోపంతో ఇండోర్ స్టేడియం ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

– రాజశేఖరరెడ్డి, కాంట్రాక్టర్, పెనుకొండ

సందడిగా ఉగాది



హిందూపురం: ప్రత్యేక అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి



హిందూపురం: విష్ణు మూర్తి అలంకరణలో పేట వేంకటరమణస్వామి



రొద్దం: పెద్దాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు



అగళి: ప్రత్యేక అలంకరణలో శంకేశ్వరస్వామి



అమరాపురం: అలంకరణలో చోళామాంబదేవి



అలంకరణలో కొత్తపాళ్యం వేంకటేశ్వరస్వామి

హిందూపురం: ఉగాదిని పట్టణ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సూగురు ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా ఆంజనేయస్వామికి విశేష పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పల్లకీలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. పేటవెంకటరమణస్వామి , కొల్హాపురి మహాలక్ష్మి ఆలయం, వాసవీ కన్యాకా పరమేశ్వరీ ఆలయం తదితర ఆలయాల్లో పూజలు చేశారు. దుకాణాలు, వ్యాపార కేంద్రాల్లోనూ లక్ష్మీదేవి పూజలు చేశారు. పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు.

పెనుకొండ: పెనుకొండ పట్టణంలో ఆదివారం ఉగాది పర్వదినాన్ని ప్రజలందరూ ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే స్నానమాచరించి నూతన వస్త్రాలు ధరించి ఇంట్లో ప్రత్యేక పూజలు తర్వాత తమ కుటుంబీకుల సమాధుల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

అమరాపురం: మండలంలో ఉగాది ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇళ్లు, ఆలయాలు, దుకాణాలకు మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాలకు వెళ్లి స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కన్యాకా పరమేశ్వరి ఆలయంలో అర్చకులు అశ్వర్థనారాయణశాస్త్రి విశ్వావసు నామ సంవత్సరం పంచాంగాన్ని చదివి వినిపించారు. ఈ సంవత్సరం బాగుందని మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయని చెప్పారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉంటారన్నారు.

రొళ్ల: మండల పరిధిలోని వివిధ ఆలయాలు ఉగాది సందర్భంగా కిటకిటలాడాయి. జీరిగేపల్లి అమ్మాజీ, రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, రొళ్ల లక్ష్మీనరసింహస్వామి, శ్రీరామ, శనేశ్వరస్వామి ఆలయంతో పాటు ఆంజనేయస్వామి, రొళ్లకొండ ఈశ్వర, కొత్తపాళ్యం వెంకటేశ్వరస్వామి, కాకి మల్లేశ్వర స్వామి, ఎం.రాయాపురం చంద్రమౌళేశ్వర స్వామి, జీజీ హట్టి యత్తప్పస్వామి ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ సమేతంగా కొత్త దుస్తులు ధరించి స్వామివార్లను దర్శించుకున్నారు.

మడకశిరరూరల్: ఉగాది పర్వదినాన్ని మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ పఠనం నిర్వహించారు. పెద్దల సమాధుల వద్ద కొత్త దుస్తులు ఉంచి కొబ్బరి కాయ కొట్టి పూజలు చేశారు. ఈ సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ మాజీ మంత్రి రఘువీరారెడ్డి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

రొద్దం: మండల వ్యాప్తంగా ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పెద్దాంజనేయస్వామి దేవాలయంలో అర్చకుడు గిరీష్‌స్వామి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని పురువీధుల్లో ఊరేగించారు.

హిందూపురం: స్థానిక ఎన్జీవో హోంలో ఆదివారం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. కవి సమ్మేళనంలో అధ్యక్షునిగా కల్లూరు రాఘవేంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సడ్లపల్లె చిదంబరరెడ్డి, ఎన్జీఓ అధ్యక్షులు నరసింహులు, ప్రధాన కార్యదర్శి జయగోపాల్ రెడ్డి, జెవీవీ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఈటి రామ్మూర్తి మాట్లాడారు. సాహిత్యంలో సామాజిక సమస్యలు ప్రతిబింభించాలన్నారు. ప్రజలు పడుతున్న బాధలు, అపోహలు తొలగించి మూఢనమ్మకాలను దూరం చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూజలు చేస్తున్న దీపిక దంపతులు

చిలమత్తూరు: ఉగాది పండుగను పురస్కరించుకొని హిందూపురం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, వేణురెడ్డి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దీపిక మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు, రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుడిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు

రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలసి సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు.



ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	38.0
పెనుకొండ	41.0
మడకశిర	38.0

ఉపాధ్యాయుడు శివన్నకు ఉగాది పురస్కారం



శివన్నకు ఉగాది పురస్కారం అందిస్తున్న కలెక్టర్ చేతన్

మడకశిరరూరల్: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ఆదివారం జరిగిన ఉగాది కవి సమ్మేళనంలో తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ శివన్నకు ఉగాది పురస్కారం అందుకున్నారు. కలెక్టర్ చేతన్ ఆధ్వర్యంలో జరిగిన పంచాంగ పఠనం కవి సమ్మేళనంలో భాగంగా ఉపాధ్యాయుడు శివన్నకు కలెక్టర్ ఉగాది పురస్కారాన్ని అందజేసి సన్మానించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



వెంకటేష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఈరలక్కప్ప

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుడ్డయ్యపాళ్యం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు వెంకటేష్ (33) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శనివారం బెంగళూరులో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప.. రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ రామిరెడ్డి, నాయకులు శేషాద్రి, నాగభూషణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, మంజునాథ్, నరేష్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులతో కలిసి వారి స్వగ్రామానికి వెళ్లి వెంకటేష్ మృతదేహంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ కోసం వెంకటేష్ చేసిన కృషిని మరువలేమన్నారు. మృతుని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ‘రాయల్స్ జట్టు’



ట్రోఫీతో ఆలూరి రావూడి రాయల్స్ జట్టు

అగళి: అగళి ప్రీమియర్ లీగ్ సీజన్ –2 టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఉల్లేకెర భజరంగి వారియర్స్ – ఆలూడి రావుడి రాయల్స్ జట్ల మధ్య ఆదివారం మండల కేంద్రంలో ఫైనల్ మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన రావుడి రాయల్స్ జట్టు 66 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ దిగిన ఉల్లేకెర జట్టు 5 వికెట్లను కోల్పోయ 53 పరుగులు మాత్రమే చేసింది. అగళి జెడ్పీటీసీ సభ్యుడు ఉమేష్ ముఖ్యఅతిథిగా హాజరై రావుడి రాయల్స్ జట్టుకు కప్‌తో పాటు రూ.30 వేల నగదును బహుమతులను అందజేశారు. రన్నర్స్‌కు కప్‌తో పాటు రూ.15 వేల నగదు అందించారు. మూడో స్థానంలో నిలిచిన రామపురం జట్టుకు రూ.10 వేల నగదు బహుమతిని అందజేశారు.

ఆస్తి పన్ను వసూలుకు రెండు కౌంటర్ల ఏర్పాటు

మడకశిర: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆస్తి పన్ను వసూలుకు రెండు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ రంగస్వామి తెలిపారు. ఈ కౌంటర్లు సోమవారం కూడా పని చేస్తాయని పేర్కొన్నారు. 31వ తేదీ సాయంత్రం లోపు ఆస్తి పన్ను చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని సూచించారు. ఆస్తిపన్నుదారులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి బ్రహ్మరథోత్సవం



చౌడేశ్వరీదేవి బ్రహ్మరథోత్సవం సాగుతున్న దృశ్యం



ఉత్సవ విగ్రహాన్ని రథం వద్దకు తీసుకొస్తున్న అర్చకులు



అన్నదానం చేస్తున్న దాతలు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రంలో వెలసిన చౌడేశ్వరీదేవి బ్రహ్మరథోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం మూలదేవతా ప్రార్థన, గణపతి పూజ, స్వస్తి వాచన, పంచగవ్య ఆరాధన, రక్షాబంధన, కలశ స్థాపన, దేవతా ఆవాహన, అగ్ని ప్రతిష్టాపన, నవగ్రహ శాంతి హోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. మధ్యాహ్నం 1.30 గంటలకు పూర్ణాహుతి, మహామంగళారతి ఇచ్చారు. అనంతరం చౌడేశ్వరీదేవి ఉత్సవ విగ్రహాన్ని రథంపై కొలువుతీర్చి బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించారు. దేవాలయం నుంచి పంచాయతీ ఆవరణంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం వరకూ ఊరేగింపు చేశారు. బిసలమానేపల్లికి చెందిన లోకేష్ భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారి భక్తులు రమేష్, శీన, రామకృష్ణయ్యశెట్టి తదితరులు భక్తులకు మజ్జిగ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా లేపాక్షి దేవాలయం కమిటీ చైర్మన్ కరణం రమానందన్ హాజరై పూజలు చేయించారు. మాజీ మండల కన్వీనర్ నారాయణస్వామి, గ్రామ పెద్దలు ప్రభాకర్‌రెడ్డి, గోపాల్‌కృష్ణ, జయచంద్ర, నరసింహమూర్తి, చెన్నకృష్ణ, మోహన్, భరత్, రంగనాయకులు, కూతులు శీన, వెంకటేష్, నానేప్ప, చంద్ర, క్రిష్టప్ప పాల్గొన్నారు.

నేడు రంజాన్ వేడుకలు

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో సోమవారం రంజాన్ వేడుకలను నిర్వహించనున్నట్లు ముతవల్లీలు తెలిపారు. జామియా, మక్కా మసీదుల నుంచి వైఎస్సార్ సర్కిల్‌లోని ఈద్గా మైదానానికి ముస్లిం సోదరులు ప్రార్థనకు తరలిరావాలని వారు కోరారు.